# కథ చెప్పటం

ఒకసారి నేనూ, సత్యం, శివం, కూర్చుని కథలు చెప్పుకొంటున్నాము.

'సుందరం అందరిలోకి చిన్నవాడు. కథలు చెప్పే నేర్పు ఇంకా సంపాదించలేదు. అయినా మాతోపాటు కథ ఒకటి చెప్పటానికి తయారైనాడు.

ఏమి తమాషా అనుభవం వర్ణిస్తాడోనని మేమంతా శ్రద్ధగా వినటానికి సిద్ధపడ్డాము. అతను చెప్పిన కథ ఇది :

'నేను ఒకసారి మద్రాసు ప్రయాణం కట్టాను. బెజవాడలో రైలు ఎక్కాను... జనం కిట కిట లాడుతూ ఉన్నారు!'

ఇక్కడ కాస్త ఆగాడు సుందరం. వాడకి కథ నడవటం లేదు.

'ఆ రోజు నీకు కూర్చుంటానికి చోటు దొరకలేదు. అదే కదూ తమాషా?' అన్నాను నేను.

సుందరం అది కాదని తలూపాడు.

'చోటు ఎట్లాగో దొరికింది. కాని దాని తరువాత చాలా తమాషా జరిగింది, అదేమిటో ఆరోజు అల్లాగ జరిగింది! వంగోలూ నెల్లూరూ మధ్య జరిగింది.

ప్రయాణాలల్లో చాలా తమాషాలు జరుగుతూ ఉంటవి. అల్లాంటిదేదో ఒకటి వీడు చెప్పదల్చుకొన్నాడు.

ప్రయాణాల్లో జరిగిన వింత విషయాన్ని వింటానికి మేము చాలా ఆతురుత పడ్డాము.

'రైలు సరిగ్గా టైముకే బయలుదేరింది. వెన్నెల వచ్చింది. చల్లగాలి వీస్తున్నది. కిటికీలో నుంచి చంద్రబింబం వంక చూస్తూ కూర్చున్నాను. రైలు పెద్ద స్టేషనులలో మాత్రం ఆగుతున్నది.

ఇంతవరకు చెప్పి సుందరం మా వంక జూచి నవ్వాడు ఏదో తమాషా అయిన విషయాన్ని చెప్పినట్లు!

'ఏదో పెద్ద తమాషా జరిగినట్లు చూస్తావేం! రైలు పెద్ద స్టేషనులలో ఆగదూ?' అన్నాము మేము వెక్కిరింతగా.

సుందరం కాస్త తెలివి తక్కువ వాడనే మా అభిప్రాయం. చిన్న వెధవ వీడుకూడా కథ చెప్పటం ఏమిటీ అని మా గర్వం.

"చెబుతాను వినండి మరి." అని కథ మళ్లీ ఎత్తుకొన్నాడు :

"రైలు స్టేషనులలో ఆగిందీ అంటే అట్టే సేపు ఆగలేదు. ఒక నిమిషం ఆగేది."

అని చెప్పి మళ్ళీ ఆగాడు!

వీడికి ఏమీ అనుభవం జరగలేదనీ అప్పటికప్పుడు ఏదోకల్పిస్తున్నాడనీ ఆ కల్పన అయినా బాగా నడవటం లేదు అనీ గ్రహించి మేము నవ్వాము.

మేము అల్లాగ నవ్వటం జూచి మేము ఏమనుకొంటున్నదీ గ్రహించినట్లు ఉన్నాడు. ఆపళంగా చెప్పుకొని పోయినాడు.

రైలు మహావేగంతో నడిచింది. వెన్నెల చిక్కగా ఉండటం మూలాన పాలసముద్రం పొంగి వచ్చినట్లు ఉంది. కంఠంలోతు నీళ్ళలో చెట్లూ చేమలూ నుంచుని అటూ ఇటూ ఊగుతున్నట్లున్నవి!

ధన్ ధన్ మంటూ రైలు పోతున్నది. చెట్లు స్తంభాలు గిర్రున తిరిగి నాట్యం చేస్తున్నట్టుగా ఉన్నవి. గాలి ముఖంమీదికి విసురుగా వీస్తున్నది. ఈ రైలు ఆగుతుందా, లేక ఇల్లాగ భూమి చివరకు వెళ్ళి "ధాం" అని పడిపోతుందా అని భయం వేసింది. తల తిరిగిపోతున్నది.

ఇల్లాగ వాడు చెబుతూ ఉంటే మా కందరికీ నవ్వు వచ్చింది. ఈ వర్ణనకు ఏమైనా అంతు ఉందా లేదా అని నవ్వుకొన్నాము.

మేము నవ్వినా ఆ కుర్రవాడు ఆపకుండా పెద్ద ఉపన్యాసంలాగ మళ్ళీ చెప్పాడు:

"ఆ వేగం చూస్తే నా గుండెకూడా ఎక్కడికో మహావేగంతో పరుగెత్తుతున్నదని భయం వేసింది. చెట్లు, దూరాన ఉన్న గుట్టలూ, నామీద పడుతున్నట్లు, టెలిగ్రాపు స్తంభాలు, ఒకదానిమీద ఒకటి వాలిపోతున్నట్లు కనిపించినవి.

వంతెనల మీదుగా రైలు పోతున్నట్లు లేదు. రైలు అక్కడే ఉంటే వంతెనలు

రైలు క్రింద, పాములలాగ జఱ్ఱున జారిపోయినవి. కాలువలు నదులు, రైలును జూచి హడిలిపోయి, వంకర వంకరులుగా తిరుగుతూ పారిపోతున్నవి.

రైలు ఆగేటట్లు లేదు. ఆ వేగాన్ని ఎవరు ఆపగలరు? ఎవరి తరమౌతుంది. దేముడు కాదు గదా బ్రహ్మదేముడికైనా ఆ రైలును ఆపేశక్తి లేదని అనిపించింది. గుండెలు దడ దడా కొట్టుకొన్నవి."

ఓహోహొహొ ఏదో ప్రమాదం జరిగి ఉంటుంది. అది చెప్పటానికి వీడు ఇంత వర్ణన ఇస్తూ ఉన్నాడని మాకు తోచింది. ఇంతలో వాడుకూడా ఆ వర్ణన ఆపేసి. 'అప్పుడేమైందో తెలుసునా?' అన్నాడు.

మేము ఎవ్వరమూ మాట్లాడలేదు. కాని తలొక విధంగా అనుకొన్నాము. ఆ రైలు ఇంకో రైలుతో కొట్టుకొని ఉంటుందని నేను ఊహించాను.

పట్టా తొలగి రైలు పడిపోయి పెద్ద ప్రమాదం సంభవించి ఉంటుందని మావాడు అనుకొన్నాడు.

కాని మేము ఇద్దరం ఏమీ మాట్లాడలేదు. మాట్లాడకపోయినా, మా ఊహలు సుందరం గ్రహించాడు. గ్రహించి సంతోషంతో మళ్లీ చెప్పటం సాగించాడు.

రైలు అంత వేగంగా వెడుతూ ఉంటే నేనూ రైలులో ఉన్నవాళ్ళు అందరం కూడా గుండెలు అదిమి పట్టుకొన్నాము. నిజంగా అంత ఘోర కృత్యము జరుగుతుందని మేము ఎవ్వరం అనుకోలేదు. మాకు ఆశ్చర్యం వేసింది.

ఏమిట్రా – ఆ ఘోరకృత్యం? – అన్నాము ఇద్దరం ఒక్కసారి.

'చెప్పు చూద్దాము?' అన్నాడు సుందరం.

'ఏముంది ఆ రైలు ఇంకో రైలుతో కొట్టుకొని ఉంటుంది!' అన్నాను నేను.

"ఆఁ హ" అని తల ఊపాడు సుందరం.

"బ్రిడ్జి విరిగి పడిపోయిందా?" అని అడిగాడు సత్యం.

రైలు పడిపోయినా, బ్రిడ్జీ విరిగినా వీడు ఎట్లా బ్రతికి బైటపడ్డాడూ? అన్నాను నేను.

"అదే వాడు చెప్పదలచుకొన్న విచిత్రం!'

అని సత్యం నవ్వాడు.

మేము ఇల్లాగ మాట్లాడుకొంటూ ఉంటే సుందరం నిశ్చింతగా మృదువుగా నవ్వాడు.

సుందరం మాట్లాడక ఊరుకొనటం జూచి 'ఏం? మేము చెప్పినట్లే జరిగింది కాదూ?.... అని అడిగాము.

సుందరం కాదన్నట్లు తల తిప్పాడు.

ఏమిత్రా - సంగతి? .... ఏమి జరిగిందీ చెప్పూ? అని అడిగాను నేను.

మీరు చెప్పండి. చూద్దాము - అని ఆపళంగా వాడు ఏదో ఆలోచనలోకి దిగాడు.

మేము చెప్పినది కాదంటివిగా మరి?

అవి కాదు.

మరేమిటి?

అదే మీరు ఊహించవలసిన విషయం. మేము ఊహించలేము.

సుందరం కాస్త నవ్వి, కొంచెంసేపు ఆలోచించి మళ్ళీ చెప్పటం సాగించాడు.

"రైలు, అల్లాగ మహా వేగంతో వెళ్లుతున్నది. ఒక వంతెన మీదికి వచ్చింది.

ఆ వంతెన చాలా ఎత్తుగా ఉంది. రైలు బ్రహ్మాండంగా బుసలు కొడుతూ ప్రాకుతున్నట్లుంది. నురుగులు గ్రక్కుతూ క్రింద భయంకరమైన నది! పైన ప్రచండ వేగంతో పోతూ ఉన్న రైలు!! రైలులో బలహీనమైన మానవులు ! అదీ పరిస్థితి!

అప్పుడు ఏమైందీ.

చూస్తూ ఉండంగా!

బండి అంత వేగంగా పోతున్నప్పుడు  పని జరుగుతుందని మేము ఎవ్వరం అనుకోలేదు!

అని మళ్ళీ ఆగాడు.

మాకుకూడా భయంవేసింది. వీడు ఎట్లాగో బ్రతికాడు గాని. ఆ రోజున

వంతెన విరిగే ఉంటుంది! ముందు బండ్లు అన్నీ ఆ నదిలో పడిపోయి ఉంటవి!

పాపం! ఎంతమంది చనిపోయినారో! వీడి దుంపతెగ, వీడు ఒక్కడూ చావు తప్పించుకొని బైటపడ్డాడు! అవి నేను అనుకొన్నాను.

సత్యం, అల్లాగే అనుకొన్నాడు.

ఇద్దరం కూడా చాలా ఆదుర్దాగా సుందరం వంక చూశాము.

సుందరం కూడా బిక్కముఖంతో ఆ భయంకర వృత్తాంతము చెప్పటానికి సందేహిస్తున్నట్టుగా మా వంక చూచాడు. ఊ, చెప్పు, ఏం జరిగిందో? అన్నాము మేము. ఆదుర్దాగా.

“మేము ఎవ్వరం కూడా అనుకోలేదు. అంత విచిత్రం జరుగుతుందని!!

మేము మామూలుగానే కూర్చుని చూస్తున్నాము. బ్రిడ్జి మీదికి రైలు వచ్చినప్పటినుంచి, క్రిందకి చూస్తున్నాము.

నీళ్లు ఎక్కడో అడుగున ఉన్నయ్

కళ్ళు తిరిగి పోయినయై అన్నమాట. మేమందరం చూస్తూనే ఉన్నాము. అంత వేగంగా వెళ్ళుతున్న రైలు, భయంకరంగా ప్రవహిస్తున్న నది మీద క్షణంలో – అట్లా అయిపోతుందని ఎవ్వరూ అనుకోలేదు.

“ఆఁ ఏమైంది?” అన్నాము ఇద్దరం కూడా భయంతో.

ధన్, ధన్, పోతున్న రైలు, రైలంతా ఆ చివరనుంచి ఈ చివరదాకా ఒక్కసారి, ఆగిపోయింది!!!

ఇది విని మేము వెంటనే నవ్వలేదు. ఇంకా ఏమి చెబుతాడోనని చూస్తున్నాము.

ఇంకేముంది చెప్పటానికి?

రైలు ఆగిపోయిందట!

అదే విచిత్రం.

అదే విచిత్రం అని సుందరం చెప్పిన తరువాత కాస్త నవ్వు వచ్చింది.

*(ఆనందవాణి మార్చి, 1948)*